

శ్రీశైన కులస్తులను వైసీపీ విస్మరించింది

విశాలాంధ్ర-పలాస: రాష్ట్రంలో శ్రీశైన కులస్తులు 5 లక్షలకు పైబడి ఉన్నారని, శ్రీశైన కులస్తులకు వైసీపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించలేదని అఖిల భారత గౌడు సంఘం కన్వీనరు కోళ్ల ఈశ్వరరావు అన్నారు. శనివారం పలాస టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం శ్రీశైన కులస్తులను గుర్తించి సుస్థిరస్థానాన్ని కల్పించిందని, పలాస నియోజకవర్గంలో గౌతు శిరీషాకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి గౌరవించిందన్నారు. మా కులస్తులంతా టీడీపీకి మద్దతు పలుకుతున్నామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో శిరీషా గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు చింతపల్లి కనకారావు, వి.నాగరాజు, బి.అప్పారావు, కె.బాలరాం, వి.మహాలక్ష్మీ, ఆర్.రాంబాబు, ఎల్.వెంకటరమణ, మన్మధరావు, డి.జ్యోతిభాస్కరరావు, వి.రామరాజు, బి.సూర్యక్రిష్ణంరాజు, ఆర్.దానయ్య, బి.ఢిల్లేశ్వరరావులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సక్రమంగా నిర్వహించండి

ఉమ్మడి కూటమి టిడిపి అభ్యర్థి, రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని ఉమ్మడి కూటమి టిడిపి అభ్యర్థి, బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల విధానాన్ని ఆయన పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకునే ఒటర్లకు వారి గుర్తింపు కార్డులను బ్యాలెట్ పత్రాలను అందించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సి.ఐ, బి.ప్రసాదరావు, ఎస్.ఐ, అశోక్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రతినిధులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

విశాలాంధ్ర-మందస : వైసీపీ నాయకుల అరాచకాలకు అద్దుపోద్దు లేకుండా పోయిందని, జీవం లేని మొక్కలను నరికేయడం చాలా తప్పని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. మండలం కేశుపురం గ్రామానికి చెందిన బొద్దు మహలక్ష్మీ, ఆమె కుమారుడు మోహన్ ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరడంతో వారి జీడితోటలో చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేయడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శివాజీ వారిని పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్నో ఏళ్లు రాజకీయాలు చేశానని, ఎమ్మెల్యే పదవులు చేపట్టానని ఇటువంటి ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. వ్యక్తులపై కక్షలు కట్టి జీడితోటలు నాశనం చేయడం చాలా బాధ కలిగిందన్నారు. ఆయనతో పాటు జి.కె.నాయుడు, బి.కర్రెయ్య, లబ్బ రుద్రయ్య, మాధవరావు, మామిడి తాతారావు, దామోదర్, లోకనాధం, విజయ్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా పట్ల కఠిన చర్యలు

విశాలాంధ్ర-సోంపేట : మద్యం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అక్రమంగా రవాణా చేయడం నేరమని అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.గంగాధరం పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాత్రి సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కంచిలి మండలంలో ఆంధ్రా ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్కనున్న ఒడిశా రాష్ట్రం నుంచి మద్యం గాని, మాదక ద్రవ్యాలు గాని ఆంధ్ర రాష్ట్రానికి దిగుమతి చేసుకోవడం చట్ట రీత్యా నేరమన్నారు. ఇటువంటి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సోంపేట సెబ్ సిఐ జైభీం, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని బురాగం పంచాయతీలో పలు గ్రామాల్లో బూరాగాం గ్రామం లో పారిశుద్ధ్య సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ వ్యవస్థ లేకపోవడంతో మురుగు, వీధిలో పేరుకు పోతుంది. దీంతో దోమలు దుర్గంధంతో అవస్థలు పడుతున్నామని తరచూ రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు పాలన మళ్లీ రావాలి - నారా రోహిత్

విశాలాంధ్ర-రణస్థలం: ప్రముఖ సినీ హీరో నారా రోహిత్ శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గం ఉమ్మడి కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)కి తమ మద్దతు తెలియజేయడానికి శనివారం క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపే దమ్మున్న నాయకుడు నారా చంద్రబాబునాయుడు మాత్రమేనని, విజన్ కలిగినటువంటి నేతకు ప్రజలు మద్దతుగా నిలవాలని, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వర రావు కమలం గుర్తుపై ఓటు వేయాలని, అలాగే ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఇరువురి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్ర ప్రగతికి అండగా నిలవాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ యుగపురుషునిగా నిలిచిన సీఎం జగన్

- ఏపీ శాసనసభాపతి స్థానిక వైఎస్ఆర్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర -ఆముదాలవలస: రాష్ట్రం సర్వతో ముఖావృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అప్రతిహతంగా కొనసాగాల్సిన ఆవశ్యకత ఉందని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం ఆముదాలవలస మండలం కొత్తవలస పాతూరు నిమ్మ తొర్లాడ సిరి సింపేట జీకే వలస గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పయనిస్తూ, సంక్షేమ పాలన పరంగా అన్ని వర్గాల ఆదరభిమానాలను చేరుకొందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం నాలుగు మూల స్తంభాలుగా పరిపాలన కొత్త పుంతలు తొక్కిందన్నారు. ముఖ్య మంత్రి జగన్మో హన్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి సంక్షేమ ము సమపాళ్లలో జరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని పనుల ను వైసీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అన్నిటిని అమలు చేయడం తో పాటు, ప్రజలకు వాగ్దానాలు ఇవ్వని పనులు కూడా చేపట్టడం జరిగిందని వివరించారు. స్వాతంత్ర్య వచ్చిన తర్వాత ఏ నాయకుడు చేయని విధంగా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముఖ్యమంత్రి అభివృద్ధితో ముందుకు నడిపిస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతి నిధి తమ్మినేని శ్రీరామ్‌మూర్తి, జడ్పిటిసి బెండి గోవిందరావు, వైఎస్ఆర్ పార్టీ సీని యర్ నాయకులు కోట గోవిందరావు, కోట వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగు బెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ నిరంజన్ బాబు, స్థానిక ఎంపీటీసీ కుటుకుప్పల సన్యాసిరావు, వైస్ సర్పంచ్ అప్పలనాయుడు, సోమరాజు, తేజ, కృష్ణ, గణపతి, బగ్గు కుమార్ తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలే టిడిపి విజయానికి సోపానాలు

- ఇంటింట ప్రచారంలో కూన సత్యారావు

విశాలాంధ్ర -పొందూరు : రాష్ట్రంలో అన్నింటి చోట తెలుగుదేశం ప్రభంజనం పెరుగుతుందని, అసెంబ్లీ పార్లమెంటరీ రెండిటా శత శాతం సూపర్ సిక్స్ పథకాలే తెలుగుదేశం పార్టీ విజయానికి సోపానాలవుతాయని పొందూరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు, కూన రవికుమార్ సోదరుడు కూన సత్య రావుఅన్నారు. మండలంలోని రెడ్డిపేట తానేం బాణం గ్రామాలలో ఆపదల వలస నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ కి బలపర్చి సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటాప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో టిడిపి నేతలకు మంచి ఆదరణ లభించింది. రాష్ట్రంలో వైసిపి దుష్పరిపాలనకు ఈ ఎన్నికల ద్వారా అంతం చేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కల్లబొళ్ళు కదల జెప్పి నంగనాచి మాటలతో ఓట్లకు కోసం మాయదారి మాటలు చెబుతున్న అధికార పార్టీ మాటలు విని మోసపోవద్దనిఓటర్లకు వివరించారు. రాష్ట్రంలో రామరాజ్య స్థాపనకుసైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతోఎమ్మెల్యేగా కూన రవికుమార్ను, పార్లమెంటు సభ్యుడిగా కింజరాపు రామ్మోహన నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలనివారు కోరారు. ఈ కార్యక్రమంలోమండల టిడిపి అధ్యక్షులు చిగిలివల్లి రామ్మోహనరావు, పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీ రంగనాయకులు (చిన్నరంగా)జిల్లా తెలుగు యువత సంయుక్త కార్యదర్శి బలగ శంకర భాస్కర్, జిల్లా జనసేన పార్టీసంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నం నాయుడు, జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ అధ్యక్షులు గార బాబురావు,మండల పార్టీఉపాధ్యక్షులుబాడా న శేషగిరి నాయుడు,పొందూరు మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి,పొందూరు నెంబర్ టు ఎంపీటీసీలు బాడాన అనకాపల్లి వాణి, దల్లి పేట మాజీ సర్పంచ్ బడి రఘురాం,మాజీ ఎంపీటీసీదండా రవికుమార్,పొందూరు టౌన్ మాజీఅధ్యక్షులు మద్దిల శ్రీనివాసరావు, బిజెపి జిల్లా నాయకులు బలివాడ సత్యనారాయణ, పేరూరి శ్రీనివాసరావు, సింహాచలంతదితరులు పాల్గొన్నారు.

వైకాపా హయాంలోనే యాదవులకు పెద్దపీట

- ఎమ్మెల్సీ నర్తు రామారావు
- 7న పెద్దపాడులో యాదవ కుల సమావేశం

విశాలాంధ్ర -అరసవల్లి: వైకాపా ప్రభుత్వం యాదవులకు పెద్దపీట వేసిందదానికి తనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడమే ఒక ఉదాహరణ అని ఎమ్మెల్సీ నర్తు రామారావు పేర్కొన్నారు. నగరంలోని టౌన్‌హాల్ లోని వైకాపా పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. ఈ నెల 7న పెద్దపాడులోని జరగనున్న యాదవ సంఘ సమావేశానికి జిల్లాలోని యాదవకుల సంఘ నాయకులు, పెద్దలు హాజరుకావాలని రామారావు కోరారు. ఇచ్చిన మాటను కట్టుబడి ఉన్న నేత సీఎం జగన్మోహన్రెడ్డి అన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైకాపా ఎంపి అభ్యర్థి పేరాడ తిలక్, అసెంబ్లీ అభ్యర్థులు తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, దువ్వాడ శ్రీనివాస్, పిరియా విజయ, ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్కుమార్కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించడానికి కృషి చేయాలన్నారు. యాదవ కుల సామాజిక వర్గాన్ని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని రామారావు గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు గద్దెబోయిన కృష్ణయాదవ్, జిల్లా కార్యదర్శి బూర పాపారావు, సంఘ నేతలు చీమల తారకేశ్వరరావు, బాగు దశరధయాదవ్, సింగోల శ్యామ్, నక్క దేవానందయాదవ్ తదితరులు ఉన్నారు.

ఓటేసేందుకు క్యూ కట్టిన ఉద్యోగులు

- పెరిగిన ఉద్యోగుల ఓటింగ్ శాతం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఓటేసేందుకు ఉద్యోగులు క్యూ కట్టారు. శనివారం పోస్టల్ బ్యాలెట్ పక్రియ ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచి ఉద్యోగులు క్యూ లైన్ లో నిలబడి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పి ఓ, లు, ఏపీ ఓ, సూక్ష్మ పరిశీలకులు శనివారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడు రోజుల పాటు సిబ్బంది ప్రాతిపదికన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అనివార్య కారణాల వలన ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఓటు వెయ్యలేని సిబ్బందికి నాలుగో రోజు అవకాశం కల్పించారు. మొత్తం 25505 మంది పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. స్థానిక ప్రభుత్వ కళాశాలలో, పాతపట్నం కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.మనజీర్ జిలాని సమూన్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నియోజక వర్గ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ ఆ నియోజక వర్గ ఉద్యోగులు ఆయా కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించు కున్నారు. టెక్కలి నియోజకవర్గం, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల పరిశీలకుడు సందీప్ కుమార్, ఆర్వో నూరూల్ ఖమర్ పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. గతం లో కంటే ఈ సారి ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు.

వైసిపి సంక్షేమ పథకాలు లబ్ధిపొందితే ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి

మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

విశాలాంధ్ర -కవిటి: జగనన్న ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ అండగా, ఇంటింటా పథకాలు అందించారని, వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన వారుగా జగనన్న రుణం తీర్చుకోడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిరియా విజయ కు, శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్ కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కోరారు. ఈమేరకు శనివారం మండలంలోని ఇద్దివానిపాలెం, చిన్నకర్రీవాని పాలెం, బట్టివానిపాలెం గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సేవ చేసే వారి రుణం తీర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఫ్యాను గుర్తుకే ఓటేయాలని ప్రాధేయపడ్డారు. జగనన్న అందించే పథకాలే వైసీపీ విజయానికి సోఫానాలనివారన్నారు. ప్రజలందరూ అండగా నిలిస్తే మరిన్ని పథకాలు పేదలకు అందించి పేదరికం లేని రాజ్య స్థాపన చేస్తామని హామీ నిచ్చారు. ప్రతి ఇంటిలో అమ్మఒడి,విద్యా దీవెన,వసతి దీవన,నిరుపేదలకు నిలువ నీడ కల్పించాలన్న సంకల్పంతో ప్రతి పేదవాడికి స్వగృహం, రైతు రుణమాఫీ, ప్రతి ఇంటికి త్రాగునీరు కల్పనా,అవ్వ తాతలకు ఆనందం కల్పించే విధంగా వృద్ధాప్య పింఛన్, రైతు భరోసావంటి ఎన్నెన్నో పథకాలు అందించే భారతదేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రుణం తీర్చుకునే రోజు ఆసన్నమైందని అందుకు మీదైన శైలిలో మీపవిత్రమైన ఓటును ఫ్యాన్ గుర్తుకే వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రీ గోపయ్య, సర్పంచులు పూడి వరప్రసాద్, గండుపల్లి రమేష్, బద్రి ప్రకాష్, పిరియా కృష్ణా రావు, గండుపల్లి హనుమంత రావు, భూసరాజు, దుద్ది సతీష్, సర్పంచులు, ఎంపీటీసీలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి : మాజీ ఎంపీపీ కూన ప్రమీల.

విశాలాంధ్ర-ఆమదాలవలస: టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగు తుందని మాజీ ఎంపీపీ, ఎమ్మెల్యే అభ్యర్థి కూన ప్రమీల అన్నారు. పుర పాలక సంఘంలో 22 వ వార్డు లక్ష్ముడిపేటలో ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై శనివా రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన వెంట నే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయ డం జరుగుతుందని వివరించారు. నిరు ద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు, నిరుద్యోగ భృతి ఇవ్వడం జరుగు తుంద ని తెలిపారు. టిడిపి హయాంలో రాష్ట్రా నికి నూతన పరిశ్రమలు వస్తాయని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అందువలన ప్రతి ఒక్క రు టిడిపికి ఓటు వేసి టిడిపి అభ్యర్థుల ను గెలిపించుకోవలసిన అవసరం ఉంద న్నారు. పేదల కోసం నిరంతరం పనిచేసి న టిడిపి కి ప్రజలు ఆదరించాలని కోరా రు. ఎమ్మెల్యేగా రవికుమార్ కు, ఎంపీగా రామ్మోహన్ నాయుడు కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కోరారు. రవికుమార్ టిడిపి హయాంలో పురపాలక సంఘంలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ప ర్సన్ తమ్మినేని గీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కనితి విజయలక్ష్మి భాయ్, కె.వి రాజ్యలక్ష్మి, సిమ్మ మాధవి, కింజ రాపు సుప్రియ, కూన ఆంజనేయులు, గురుగుబెల్లి నాగేశ్వరరావు, పప్పల కృష్ణారావు, పేడాడ పూర్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఈవోపై పారిశుధ్య కార్మికురాలు పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుద్య కార్మికురాలుగా పనిచేస్తున్న బామిని భవాని పంచాయతీ ఈవో చింతాడ సన్యాసిరావు (శ్రీనివాస్)పై శనివారం స్థానిక పోలీస్‌లకు పిర్యాదు చేశారు. కొంత కాలం నుంచి నాపట్ల అసభ్యకరంగా ఈవో ప్రవర్తిస్తున్నాడని ఆ పిర్యాదులో అమె పేర్కొన్నారు. కార్యాలయంలో పని చేస్తుండగా నా పై పలు మార్లు అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బంది పెట్టేవాడని, అసభ్య పదజాల మాటలు అడేవాడని, నేను పలు మార్లు విజ్ఞప్తి చేసినప్పటికి ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని అమె అవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో ఈవో ప్రవర్తన ఏ మాత్రం సరిలేదని, నేను అడ్డు చెప్పిన ప్రతి సారి నా పై తప్పుడు పిర్యాదులు పైఅధికారులకు పంపించి నా ఉద్యోగాన్ని తీయించేటట్లు చేస్తానని బెదించాడని అమె పిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న కారణంగా సర్వ హక్కులు ఉన్నాయని పదిమార్లు తెలిపారన్నారు. ఈ విషయం అంతా నా భర్తతోను, మరియు మా గ్రామ పెద్దలతోను చెప్పటం జరిగిందన్నారు. అలాగే గతనెల ఏప్రిల్ 28న ఉదయం రాత్రి 10 గంటలకు ఆయన గదిలోంచి కబురు పెట్టగా ఆయన గదిలోకి వెళ్ళానని, నేను చెప్పినట్లు చేయాలని ఆయన కోరగా నేను నిరాకరించానని, అందుకు నాపై తిట్లు పురాణం విప్పాడని, ఉద్యోగం కూడా తీయిస్తానంటూ బెదిరింపులకు దిగాడని, అప్పటి నుంచి నేను కార్యాలయానికి వెళితే నాపై అసభ్యకర పదజాలాలతోను, కులం పేరుతోను దోషించేవాడని గత కొన్ని రోజులుగా నన్ను శారీరకంగా, మానసికంగా శోభపెడుతున్నాడని అందువలన నా ఉద్యోగ నిర్వాహణ చేయలేకపోతున్నానని, ఆ ప్రాంతంలో ఉండటానికి భయం కలుగుతుందని, భయంతోనే పిర్యాదు చేయటం జరిగిందని అమె తెలిపారు. దీని పై విచారణ జరిపి నాకు న్యాయం చేయాలని ఎస్ఐకు కోరానని అమె విలేకర్లుకు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, డా.మనజీర్ జిలాని సమూన్ పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ గుర్తింపు కార్డులను సరిచూసుకొని, ఓటర్లకు బ్యాలెట్ పత్రాలను అందచేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషనర్ల ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు జవాబుదారీతనంతో ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం శాశనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, సి.రంగయ్య, నరసన్నపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి, రామ్మోహన్‌రావు, తహశీల్ధార్, కనకారావు, ఎన్నికల డిటి, శరత్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-కాశీబుగ్గ : కాశీబుగ్గ విద్యుత్ స్టేషన్ పరిధిలో పెంటిభద్ర, జయరామచంద్రపురం, తాళభద్ర, అంబుసోలి, పద్మనాభపురం కాలనీ, ఎరుకోల సత్యారావు కాలనీ, నర్సిపురం, పెసరపాడు, చినబాడాం, అంతరకుడ్డ, రాజపురం, దంతంరామారావువీధి తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పలాస విద్యుత్ శాఖ డి.ఇ ప్రసాధరావు ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంబంధించిన మరమ్మతుల పనులు చేపట్టేందుకే విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.

కవిటి: మండల కేంద్రంలో గల కవిటి కొత్తగా నిర్మించిన సబ్‌స్టేషన్ కొరకు రాజపురం నుండి వేయనన్న ప్రత్యామ్నాయ 33 కెవి లైన్ వైరింగ్ చేసే క్రమంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇఇ జి ప్రసాద్,ఏఈ నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంకాలం 5గంటల వరకు కొత్తగా నిర్మించిన కవిటి సబ్ స్టేషన్ కొరకు రాజపురం నుండి కవిటి వెయుచున్న ప్రత్యామ్నాయ 33కేవీ లైన్ వైరింగ్,విద్యుత్ లైన్ కి దగ్గరలో వున్న చెట్లు తొలగించుటకు 11కేవీ కవిటి టౌన్ ఫీడర్ క్లియరెన్స్ కోసం చింతామణి అమ్మ వారి టెంపుల్ వీది,ఎం ఆర్ ఓ ఆఫీస్,ఎంపీడీవో ఆఫీస్ వీధి కి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొక్కుబడిగా మండల సమావేశం

విశాలాంధ్ర-హిరమండలం: సార్వత్రిక ఎన్నికలు మే 13న జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షుతన, ఎంపీడీఓ డిడి స్వరూపరాణి ఆధ్వర్యంలో మండల సర్వ సభ్యసమావేశం ఏదో మొక్కు బడిగా జరిగింది. ఎన్ని కలకోడ్ అమలులో ఉన్నందున తీర్మానాలు, సమస్యలు, సభలు, తదితర విషయాలు ఏవీ ప్రస్తావించ కూడదు కాబట్టి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు హాజరు సంతకాలతో సభ ముగించినట్లు ఎంపీడీఓ డి డి స్వరూప రాణి తెలిపారు. వైస్ ఎంపీపీ ఎస్ వెంకట్ రావు, జడ్పీటీసీ పి బుచ్చి బాబు, ఎంపీటీసీ లు బేవర గంగాధర్, సి హెచ్ బుడ్డు, ఎస్ శ్రీదేవి, తల్ల శంకర్ రావు, సర్పంచ్ లు లంక రోజా రాణి, ఎం దండాసి, ధర్మాన దణ్ణజ్జారావు, కో అప్షన్ మెంబెర్ విష్ణు ప్రసాద్ పండా, ఈఓ పి ఆర్డీ పి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 756 ఓట్లు పోల్

విశాలాంధ్ర -పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ లో మొదటిరోజు 756 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి ఎం.సురేష్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించు కున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు. మొదటిరోజు పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో సీల్ చేసి, స్ట్రాంగ్ రూమ్ కు తరలించారు. ఇదిలా ఉండగా పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో అధికార, ప్రతిపక్ష పార్టీలతో పాటు, స్వతంత్ర అభ్యర్థులు శిబిరాలను ఏర్పాటు చేశారు.

ఆర్టీఐ అమలు పట్ల ఇంత నిర్లక్ష్యమా...!

మార్చి 26న మొదటి అప్పీల్ విచారణకు రమ్మని అప్పీలుదారునికి ఏప్రిల్ 2న రిజిస్టర్డ్ పోస్టు
- సెక్షన్ 19(1) మొదట అప్పీల్ విచారణలో ఆర్డీఓ కార్యాలయం వింత పోకడ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: కోరిన సమాచారం ఇవ్వలేదని సెక్షన్ 19(1) ప్రకారం పిర్యాదు చేసిన అప్పీలుదారునికి మార్చి 26న విచారణకు హాజరు కావాలని ఏప్రిల్ 2న రిజిస్టర్ పోస్టు చేసి లేఖను పంపిన శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిలువుటద్దం ఈ సంఘటన. దీనికి సంబంధించి పూర్తి వివరములు సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు ఆధారములతో శనివారం పత్రికలకు విడుదల చేశారు. శ్రీకాకుళం మండలం సింగుపురం రెవెన్యూ గ్రామంలో పాత సర్వే నెంబరు 1892/పి కొత్త సర్వే నెంబరు 405-1 లో 1.50 ఎకరాలకు ముడిదాన గురయ్యకు డి పట్టా 1975 లో ఇచ్చి ఉంటే వాటి వివరములు, అలాగే డి పట్టా స్థానంలో 2008లో డూప్లికేట్ డి పట్టా జారీ చేసి ఉంటే వాటి యొక్క ఆధార పత్రములు అందించమని, డి పట్టా లబ్ధిదారుల జాభితా యొక్క సర్టిఫైడ్ కాపీస్ అందించాలని, మరో రెండు అంశములకు సంబందించిన పూర్తి సమాచారం కోసం మండల తహశీల్దార్ శ్రీకాకుళం కార్యాలయంలో ఫిబ్రవరి19, 2024న ఆర్టీఐ యాక్ట్ 2005, సెక్షన్ 6(1) ప్రకారం దరఖాస్తు చేయడం జరిగింది.భూమి రికార్డులకు సంబంధించి ఆర్టీఐ నుంచి మినహాయింపులు లేవని రిట్ పిటిషన్ నెం.16717/2008 యందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హై కోర్టు డిసెంబరు4,2008న చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్ వారికి, ఏపి చీఫ్ కమిషనర్ ఆఫ్ ఆర్టీఐ యాక్ట్ 2005, హాకా భవన్,హైదరాబాద్ వారికి మధ్య జరిగిన కేసులో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చియున్నారు. అయినప్పటికీ సంబంధిత పౌర సమాచార అధికారి 1,2,3అంశములకు అరకొర సమాచారం అందించి,4 వ అంశంలో భూమి రికార్డులు పబ్లిక్ రికార్డ్స్ అయినప్పటికీ వ్యక్తిగత సమాచారం పేరిట సెక్షన్ 11(1) కు సంబంధం లేనప్పటికీ సమాచారం అందించుటకు నిరాకరించారు. దీనిపై ఆర్డీఓ శ్రీకాకుళం వారికి మార్చి11,2024న సెక్షన్ 19(1) ప్రకారం మొదట అప్పీల్ చేయడం జరిగింది. సంబంధిత పౌర సమాచార అధికారి నుండి కోరిన సమాచారం అందేలా విచారణ జరిపి చర్యలు చేపట్టవలసిన అధికారులు ఆర్టీఐ యాక్ట్ 2005 అమలుకే ఎసరు పెట్టేలా వ్యవరించడం ఆశ్చర్యాన్ని,ఆందోళన కలిగిస్తుంది.మార్చి26న విచారణకు హాజరు కావాలని కోరుతూ ఏప్రిల్ 2వ తేదిన రిజిస్టర్ పోస్టు చేస్తూ ఆర్టీఐ అమలు పట్ల తమకున్న నిజస్వరూపాన్ని బయట పెట్టారు.అధికారుల తీరు చూస్తుంటే ఆర్టీఐ పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమౌతుంది. ఇప్పటికైనా ఇటువంటి నిర్లక్ష్య చర్యలు మరలా పునరావృత్తం కాకుండా రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకాకుళం వారు, జిల్లా నోడల్ అధికారి డీఆర్వో, జిల్లా సమన్వయాధికారి కలక్టరు తగు తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆర్టీఐ కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని ఆర్టీఐ ఉద్యమ నేత అనపాన షణ్ముఖ రావు హెచ్చరించారు.

శిష్టకరణాలను బిసిలో చేర్పించిన ఘనత దివంగత వైఎస్ఆర్‌దే

వైఎస్ఆర్ కుటుంబానికి రుణపడి వుంటాం
శిష్టకరణ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్, సదాశివుని కృష్ణ

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్రంలో శిష్టకరణాలను బి.సి జాబితాలో చేర్పించిన ఘనత దివంగత డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిదే అని శిష్టకరణ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్, సదాశివుని కృష్ణ అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన జరగనున్న శాశనసభ, లోక్‌సభ ఎన్నికల్లో నరసన్నపేట నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మాన కృష్ణదాస్‌కు, ఎంపి అభ్యర్థి, పేరాడ తిలక్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ విధంగా శిష్టకరణాలకు సహాయపడిన వైఎస్ఆర్ కుటుంబానికి శిష్టకరణాలు ఓట్లు వేసి, వారి రుణం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో శిష్టకరణ కుటుంబాలకు సుమారు రూ.12కోట్లతో అమ్మఒడి, చేయూత, ఆసరా తదితర అనేక పథకాలు ద్వారా ఆర్థికంగా సహాయమందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్, రఘుపాత్రుని శ్రీధర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, సదాశివుని ప్రభాకరరావు, శిష్టకరణ సంఘం ప్రతినిధులు, అంపలాం వసంతకుమార్, ఆర్. వైకుంఠరావు, డబ్బీరు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల తేదీల్లో స్వల్ప మార్పులు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల తేదీల్లో స్వల్ప మార్పులు చేశారు. రెండు, నాలుగు సెమిస్టర్ల సప్లిమెంటరీ విద్యార్థులు రాస్తున్న పరీక్షల తేదీలను మాత్రమే మార్పు చేసినట్లు డా.బిఆర్ఏయూ పరీక్షల విభాగం డీన్ డా. ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో ఐసెట్-2024 ప్రవేశ పరీక్ష జరుగుతుండటం, ఎంబిఎ మరియు ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశానికి ఈ సప్లిమెంటరీ విద్యార్థులకు అర్హత ఉండటంతో పరీక్షల షెడ్యూల్ లో మార్పు చేసినట్లు తెలియజేశారు. ఈ నెల 6, 7 తేదీల్లో జరగవలసిన డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 17, 18వ తేదీల్లో జరుగుతాయని, అదే తేదీల్లో జరగవలసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రెగ్యులర్ మోడ్ లో రాస్తున్న రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల తేదీల్లో ఎటువంటి మార్పు లేదని డీన్ డా. ఎస్.ఉదయభాస్కర్ స్పష్టం చేశారు. ఈ మార్పును విద్యార్థులు, ఆయా కళాశాలలు గమనించాలని ఆయన సూచించారు.

అశోక్‌కు 'హ్యాట్రిక్' కల నెరవేరేనా..?

- మూడో విజయానికై ఎదురుచూపు - ఇచ్ఛాపురంపై సర్వత్రా ఆసక్తి

విశాలాంధ్ర-సోంపేట/కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ఎన్నడూ లేనంత ఆసక్తి ప్రస్తుత ఎన్నికల్లో నెలకొంది. ఎన్నికల పోలింగ్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రజలు వరుస విజయాలతో డాక్టర్ బెందాళం అశోక్ ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ సాధిస్తారా లేక తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి పిరియా విజయకు అదృష్టం వరిస్తుందా అన్నది సర్వత్రా చర్చ నీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ కంచుకోటగా భావిస్తున్న ఇచ్ఛా పురం నియోజకవర్గం ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత ఒక్క పర్యాయం మినహా మిగతా అన్నిసార్లు టీడీపీ విజయఢంకా మోగిస్తూ వస్తోంది. తెలుగుదేశం పార్టీలో అన్న ఎన్టీఆర్ పిలుపు మేరకు కవిటి మండలం నుంచి ఉద్దానం ముద్దుబిడ్డగా వేలాది మంది అభిమానులచే ముద్రపడిన అశోక్ తండ్రి బెందాళం ప్రకాష్ తన కేరీర్‌లో ఎన్నోమార్లు ఎమ్మెల్యే టిక్కెట్ ప్రయత్నించి విఫలమైనప్పటి నుంచి ఆయన కోరిక తన కుమారుడు అశోక్ ద్వారా నెరవేరడం విశేషం. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో అరంగేట్రం చేసిన యువనేత డాక్టర్ అశోక్‌కు పార్టీ అభ్యర్థిత్వం ఖరారు చేయడం ఆ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన విషయం తెల్సిందే. అనంతరం 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ఓటమి పాలైనప్పటికి ఇక్కడ మాత్రం అశోక్ చరిష్మా ఏమాత్రం చెక్కు చెదరలేదని చెప్పవచ్చు. రెండో విజయం సొంతమైనప్పటికి ఇప్పటికే ఎమ్మెల్యేగా అభివృద్ధికి అవకాశం లేనప్పటికి ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిధులతో దాదాపు నాలుగు మండలాల్లోను కొంత మేరకు అభివృద్ధి చేపట్టి ఆ పార్టీ కార్యకర్తలకు నేనున్నానంటూ భరోసా ఇవ్వగలిగారు. గడచిన ఐదేళ్ళ ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాటంలోను, ప్రజలలో మరింత మమేకం కావడంలోను అశోక్ పాత్ర ఎనలేనిదిగా చెప్పవచ్చు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా అక్కడ అశోక్ హాజరుకావడం స్థానిక పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపడంలో ఆయన కృషిని అభినందించక తప్పదని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ప్రజా సమస్యలపైన, రాష్ట్ర ప్రభుత్వం తీరుపైన, పార్టీ సమావేశాల్లోను తన పదునైన పదజాలంతో ముఖ్యమంత్రిని సైతం దుయ్యబట్టడంలో ఏ మాత్రం జంకు బెంకు లేని నిఖార్సయిన నాయకత్వం అశోక్ సొంతం అంటూ పార్టీ వర్గాలు జేజేలు పలుకుతున్నాయి. నియోజకవర్గం నలుమూలలా పార్టీకి చెందిన నిరుపేద కార్యకర్త ఇంటిలో సైతం ఏ కార్యక్రమం జరిగినా తాను ఉన్నానంటూ అక్కడకు వెళ్లి ఆ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆయనకే సొంతమని చెప్పవచ్చు. గడచిన ఐదేళ్ళ ప్రతిపక్షంలో ఉన్నప్పటికి అవిశ్రాంత పోరాటం... పార్టీ బలోపేతం... పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో నిరంతరం బిజీగా ఎమ్మెల్యే అశోక్ పార్టీ కేడర్‌ను ఉత్సాహ పర్చడంలోను ప్రస్తుత ఎన్నికల రణరంగంలో కార్యకర్తలను సైనికుల్లా తీర్చిదిద్దడంలోను తనదైన శైలిలో చేసిన ప్రయత్నాలు ప్రస్తుత ఎన్నికల్లో ఆయన విజయానికి చేరువ చేస్తున్నాయని ప్రతి ఒక్కరి నోట పేర్కొంటున్న మాట. ఈ పరిస్థితులు ప్రస్తుత ఎన్నికల్లో ప్రచార భేరి మోగించేందుకు అందరినీ సంసిద్ధం చేయడంలో అశోక్‌ని రాజకీయ అనుభవం ఎంతో దోహదపడిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నియోజకవర్గంలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో కీలకమైన ప్రచార ఘట్టంలో సూపర్‌సిక్స్ ప్రచారాన్ని ప్రజల చెంతకు చేర్చడంలో ఎమ్మెల్యే అశోక్ కృషిని అందరూ అభినందిస్తున్నారు. అశోక్ సతీమణి బెందాళం నీలోత్పల కూడా తాను సైతం ఎన్నికల ప్రచారంలో అంటూ అవిశ్రాంతంగా కార్యకర్తల సహకారంతో సాగిస్తున్న ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. ఈమె సైతం ఏ ఒక్క మండలానికి పరిమితం కాకుండా నాలుగు మండలాల కేడర్‌ను ఉత్సాహ పరుస్తూ ప్రచారంలో మరింతగా దూసుకుపోతున్నారు. సూపర్‌సిక్స్ హామీల పట్ల ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. మహిళలకు, విద్యార్థులకు ఆర్థికసహాయం, ఉచితంగా వంట గ్యాస్ సిలెండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, యువతకు నిరుద్యోగ భృతి, సామాజిక పింఛను 4వేలుకు పెంపు, దివ్యాంగులకు 6వేల రూపాయల పింఛను వంటి హామీలతో ప్రజాసంక్షేమానికి రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వేస్తున్న పెద్దపీటతో ప్రస్తుతం ఎమ్మెల్యే అశోక్ ప్రాబల్యం మరింత పెరిగిందని, ఈ ఎన్నికల్లో ఆయన విజయం తథ్యమని హ్యాట్రిక్ కల తప్పక నెరవేరుతుందని కూటమి వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి.

జగన్ ప్రభుత్వాన్ని సాగనింపాలి

సినీనటుడు నారా రోహిత్

విశాలాంధ్ర-పలాస/మందస: రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్న ప్రభుత్వాన్ని సాగనింపాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు మీ ఓటు హక్కును వినియోగించుకోవాలని సినీనటుడు నారా రోహిత్ అన్నారు. శనివారం పలాస టీడీపీ కార్యాలయంలో గౌతు శిరీషాతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం మందస మండలం మధ్య, దేవుపురం, సవరమధ్య, నర్సింగపురం, మందస, హెూన్నాళి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారని, పరిశ్రమలు, కంపెనీలు తీసుకురావడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. రానున్న ఎన్నికల్లో పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌతు శిరీషాను, ఎం.పి అభ్యర్థిగా కింజరాపు రామ్మోహనాయుడును సైకిల్ గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే శిరీషా మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పాలనలో సినీ పరిశ్రమలను కూడా విడిచి పెట్టలేదని, ఏ సినిమా టిక్కెట్లు ఎంత రేటుకు అమ్మాలో జగనే నిర్ణయి స్తున్నారని, రానున్న ఎన్నికల్లో తనకు గెలిపిస్తే దామోదరసాగర్, కళింగదళ్ ప్రాజెక్టులను ఆధునీకరణ చేపట్టి పంట భూములకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. జీడి రైతులను ఆదుకుంటామని, జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల మధ్య జీడి బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. జీడి అనుసంధానమైన పరిశ్రమలను నెలకొలిపి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సంతోష్‌కుమార్ పండా, టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, దాసరి తాతారావు, జి.కె.నాయుడులు పాల్గొన్నారు.

హోరెత్తుతున్న ప్రచారాలు

- ప్రధాన పార్టీల జోరు - స్పీడు పెంచిన స్వతంత్ర అభ్యర్థులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తున్న వేల ప్రచారానికి ఇంకా వారం రోజులు మాత్రమే గడువు ఉండడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి అభ్యర్థులు మాత్రమే ఎన్నాళ్లు ప్రచారం లో పాల్గొనగా, ఇప్పుడు వారి బంధువు లు కుటుంబ సభ్యులు కూడా పాల్గొంటు న్నారు. ఊరు వాడ మొత్తం తిరిగేస్తున్నారు. ఇటు పల్లెల్లో అటు పట్టణాల్లో ఎవరిస్థాయిలో వారు ప్రచారంలో దూసు కుపోతు న్నారు. వైసీపీ తరఫున అభ్యర్థి తమ్మినేని సీతారాం తో పాటు సతీమణి వాణిశ్రీ, కుమారులు చిరంజీవి నాకు తో పాటు బంధువులు పెద్ద సంఖ్యలో ప్రచా రం చేస్తున్నారు. ఇటు టీడిపి అభ్యర్థి కోన రవికుమార్ తో పాటు ఆయన భార్య ప్రమీల అన్నా వదినలు సత్యారావు, సుధా తోపాటు బంధువులు ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఇండిపెండెంట్ లు కూడా తమ స్థాయిలో ప్రచార జోరు పెంచారు. ముఖ్యంగా స్వతంత్రంగా అభ్యర్థిగా బరిలో నిలిచిన సువ్వారి గాంధీ ప్రధాన పార్టీలకు దీటైన అభ్యర్థిగా నిలిచి ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు తానే మీ తక్కువ కాదన్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామీణ స్థాయి నేతలకు లక్షల్లో నగదు పంపిణీ చేసినట్లు చెబుతు న్నారు. నోటిఫికేషన్కు ముందే మద్యం తరలించినట్లు పార్టీ శ్రేణులు చర్చించు కుంటున్నాయి. అధికార పార్టీ చేసిన సంక్షేమం జరిగిన అభివృద్ధి చూసి ఓటే యాలని అభ్యర్థిస్తుండగా, ప్రతిపక్ష టీడీపీ జరిగిన అక్రమాలు అవినీతి జనం లోకి విస్తృతంగా తీసుకువెళుతుంది. స్వతంత్ర అభ్యర్థి గాంధీ గత పాలకులు అభివృద్ధి నిరోధకలని మామా అల్లుళ్లది ఒకటే మాట, బాటని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి తనదైన స్థాయిలో ప్రచారం చేస్తున్నా రు. ముఖ్యంగా పట్టణాల్లో అభివృద్ధి పడకేసిందని శ్రీకాకుళం. ఆముదాలవలస ప్రధాన రహదారి దారిద్ర్య పరిస్థితిని జనంలోకి తీసుకువెళ్తుంది. ఆముదా లవలస నియోజకవర్గాన్ని బావ మరుదుల పాలన నుంచి బయటకు తేవాలని అప్పుడే అభివృద్ధి జరుగుతుందని మరో స్వతంత్ర అభ్యర్థి సనపల సురేష్ కుమార్ కూడా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

టీడీపీ హయాంలోనే తీరప్రాంతాల అభివృద్ధి.

టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అచ్చెన్న

విశాలాంధ్ర-సంతబొమ్మాలి: టీడీపీ ప్రభుత్వంలోనే తీరప్రాంత గ్రామాలన్నీ దశదిశల అభివృద్ధి చెందాయని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే, కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం మరువాడ, మేఘవరం, లింగోడు, మూలపేట, కొల్లిపాడు, లక్కీవలస పంచాయితీలలో కల గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారులు, విద్య, వైద్యం, విద్యుత్ వంటి ఎన్నో మౌలిక సదుపాయాలను కింజరాపు కుటుంబ సభ్యులు అధికారంలో ఉన్నప్పుడే జరిగాయని అన్నారు. ప్రస్తుతం ఉన్న వైసిపి ప్రభుత్వం తీరప్రాంత గ్రామా ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. అచ్చన్న పర్యటనలో ప్రతి గ్రామంలో మహిళలు తెలుగుదేశం కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పూలమాలలతో, మంగళహారతులతో స్వాగతం పలికారు ఆయా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి నౌపడ సత్యన్నారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు జీరు భీమారావు, ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, టీడీపీ అధికార ప్రతినిధి సూరాడ ధనరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు సూరాడ దాసురాజు, సురాడ రాయుడు, సూరాడ భీమారావు, పరపటి రాజశేఖరరెడ్డి, వంక సోమేశ్వరరావు, చితపాన ధర్మార్జునారెడ్డి, కర్రి రామిరెడ్డి, ధూపాన కృష్ణారావు, శ్రీరంగం రాజులు, పిట్ట రాజులు, సవ్వాన ప్రసాదరావు, శ్రీరంగం ఎర్రయ్య, యంపల్ల జోగారావు, దుపాన రమణా రెడ్డి, దూపాన రామారావు, ఐటిడిపి నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం లో వైసిపి, టీడీపీ మధ్య గట్టిపోటీ

- నామినేషన్ నాటి కంటే బలపడ్డ టీడీపీ.

-రంగంలో 10మంది అభ్యర్థులు...



విశాలాంధ్ర-కొత్తూరు : శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజిక వర్గానికి రాష్ట్రం లో ఒక ప్రత్యేకత ఉంది. ఒడిస్సా, ఆంధ్రా సరిహద్దులో ఉన్న పాతపట్నం నియోజిక వర్గం రాజకీయంగా చైతన్యం గలదె అని చెప్పాలి. 1952 తొలి ఎన్నికల్లో పాతపట్నం పార్లమెంట్ నియోజకవర్గంగా అసెంబ్లీ నియోజకవర్గంగా కూడా ఉండేది. మాజీ రాష్ట్రపతి వివి గిరి ఆనాడు పాతపట్నం పార్లమెంటు నియోజకవర్గం నుండి పోటీచేసి గెలుపొంది కేంద్ర క్యాబినెట్‌లో మంత్రి అయ్యారు. ఈ నియోజకవర్గం లోనే జిల్లాను 2.16 లక్షల ఎకరాల సాగునీటి భూములను సస్యశ్యామలం చేసే వంశధార సాగునీటి ప్రాజెక్టు ఉంది. ఇక ఈ విషయం పక్కన పెడదాం... 1952 నుండి ఇప్పటివరకు 16 సార్లు పాతపట్నం అసెంబ్లీకి ఎన్నికలు జరగగా 9సార్లు స్థానికేతరులు. ఎంఎల్ఏ.లుగా ఎన్నికయ్యారు 1996 అక్టోబర్ లో కోర్టు తీర్పు ఫలితంగా ఉప ఎన్నిక జరగగా టీడీపీ పార్టీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సిఎం నందమూరి తారక రామారావు సతీమణి లక్ష్మీపార్వతి ఎంఎల్ఏగా ఎన్నికకాగా ఆనాడు రాష్ట్రమంతటా పాతపట్నం పేరు మారుమ్రోగింది. 5 సార్లు పాతపట్నం నుండి ఎంఎల్ఏ గా గెలుపొందిన ఘనత కలమట మోహనరావు కే దక్కింది 1972 లో పాతపట్నం నియోజిక వర్గం ఏస్‌సి వర్గాలకు కేటాయించగా పాత పట్నం మండలం ముక్తాపురం కు చెందిన చుక్కా పగడాలమ్మా కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీచేసి జిల్లాలో తొలి దళిత మహిళ ఎంఎల్ఏ గా రికార్డుకెక్కరు. ఈ నియోజకవర్గంలో పాతపట్నం, మెలియాపుట్టి, ఎల్. ఎన్ పేట, హిరమండలం, కొత్తూరు మండల్లాలున్నాయి. మొత్తం ఓటర్లు 2.23 లక్షలు, ఇందులో దాదాపు 30 శాతం ఓటర్లు ఏస్.సి ,ఏస్టి లున్నారు.... వరుసుగా మూడు ఎన్నికల్లో గెలవని టీడీపీ... 2004 తర్వాత పాత పట్నం నియోజిక వర్గం లో టిడిపి గెలవలేదు 2009 లో కాంగ్రెస్ అభ్యర్థి శత్రుచర్ల విజయ రామరాజు ,2014లో వైసిపి అభ్యర్థి కలమట వెంకట రమణమూర్తి, 2019 లో వైసిపి అభ్యర్థి రెడ్డి శాంతి ఎంఎల్ఏ లుగా గెలుపొందారు తాజా ఎన్నికల్లో రంగంలో పది మంది పోటీలో ఉన్నారు. వైసిపి అభ్యర్థి రెడ్డిశాంతి, టీడీపీ అభ్యర్థిగా మామిడి గోవిందరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా కొప్పరౌతూ వెంకటరావు, బీఎస్పీ అభ్యర్థిగా బొడ్డేపల్లి కృష్ణారావు, జై భారత్ నేషనల్ పార్టీ గొల్లా తిరుపతి రావు, దండకారణ్య పార్టీ అభ్యర్థిగా జన్ని సంజీవరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అనపాన శంకర్, కొయ్యనా గోవింద రావు, బగ్గు కృష్ణ, ఆర్.మోహన్ రావులు పోటీలో ఉన్నారు అయితే ప్రధాన పోటీ వైసిపి టిడిపి అభ్యర్థులు రెడ్డి శాంతి, మామిడి గోవిందరావు ల మధ్య అని చెప్పాలి 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కలమట వెంకట రమణ మూర్తి పై 15 వేల. ఓట్లు పై చిలుక మెజార్టీ తో వైసిపి అభ్యర్థి.రెడ్డి శాంతి గెలుపొందారు అయితే. మారిన తాజా తాజా రాజకీయ పరినామాలుతో వైసిపి ,టీడీపీ అభ్యర్థుల మధ్య జయాపజయాలు స్వల్ప మెజారిటీ. ఉండొచ్చు ? అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

పాలకుల నిర్లక్ష్యం అభివృద్ధికి జిల్లా దూరం

- కాంగ్రెస్ తెచ్చిన ప్రాజెక్టుల తప్ప కొత్తవేమీ లేదు..

- పార్టీ గెలిస్తే 9 గ్యారెంటీలు అమలు..

- కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి పేడాడ..

విశాలాంధ్ర-ఆమదాలవలస: పాలకుల నిర్లక్ష్యాం తో అభివృద్ధిలోజిల్లా దూర మైందని నాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టుల తప్ప కొత్తగా చేపట్టింది ఏమీ లేదని, వైసి పి టిడిపి ప్రజా సమస్యల పరిష్క రించ కుండా గాలికి వదిలేశారని, ఆ పార్టీలకు రాజకీయ ప్రయోజనాలు, సొంత అజెం డాతో ముందుకు సాగడంతో జిల్లా అభి వృద్ధి కొన్ని సంవత్సరాల వెనక్కి వెళ్లిపోయిందని కాంగ్రెస్ పార్టీ తరఫున పార్ల మెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక కళ్యాణమండపంలో ఎమ్మెల్యే అభ్యర్థి సనపల అన్నాజీ రావు తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లా డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పార్ల మెంట్ సభ్యులు స్వర్గీయ బొడ్డేపల్లి రాజ గోపాలరావు, కణితి విశ్వనాథం కృషితో పాటు, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి చొరవ తోనే జిల్లాలో అభి వృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడితే జిల్లాలో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు ఒరిస్సాతో వివాదంలో ఉన్న వంశధార ప్రాజెక్టు సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చారు. జిల్లాను అసంపూర్తి విభజన చేపట్టడంతో జిల్లా ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు. తనకు పదవులు లేకుం డా ఎన్నో ఉద్యమాలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్టు తెలి పారు. జర్నలిస్టుగా సంఘ నాయకునిగా కలం బలంతో ఎన్నో సమస్యలను పరి ష్కరించగలిగాను అన్నారు. తనను పార్లమెంటు సభ్యునిగాను అన్నాజీ రావును శాసన సభ్యునిగాను హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఐటిడిఎ లేక గిరిజనులు ఎంతో నష్టపోయారని జిల్లాలో ఐటీడీ ఏర్పాటుకు చర్యలు చేపడతా మన్నారు. టెక్కలి లో ఆఫ్షోర్ ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని శివారు భూములకు సైతం సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఉద్దానంలో ఉన్న కిడ్నీ సమస్యపై మొట్ట మొదటిగా జర్నలిస్టుగా తానే ప్రపంచం దృష్టికి తీసుకువచ్చానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్దాన ప్రాంతం ప్రజల కిడ్నీ సమస్యల పరిష్కారానికి దయాల సిస్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటికీ దయాలసిస్ సౌకర్యం లేక రోగులు చాలా దూరం వెళ్ళవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నౌపడ-రాయగడ మధ్య బ్రాడ్ గేజ్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పదేళ్లపాటు ఎంపీగా రామ్మోహన్ నాయుడు జిల్లా కు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ళు పార్లమెంట్ సభ్యునిగా ఉంటూ ఒక్క రైలు అయినా నిలుపు దల కు కృషి చేయ లేక పోయారని,దక్షిణ మధ్య రైల్వే అయ్యప్ప స్వాములకోసం ప్రత్యేక రైలు వేస్తే ఆ రైళ్లను తమ కృషితోనే వేయించినట్టు చెప్పుకోవడం శోచనీయమన్నారు. జిల్లాలో వలసలు నివార ణకు మందస మెలియాపుట్టి ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగి యూనిట్లు ఏర్పాటు, మత్స్యకారులకు కోల్డ్ స్టొరేజ్ చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. కోల్డ్ స్టొరేజ్ ఏర్పాటు చేస్తామని వైసీపీ ప్రభు త్వం హామీ ఇచ్చిన నెరవేర్చ లేక పోయా రని ఆరోపించారు. జిల్లాలో ఎన్నో వన రులు ఉన్నప్పటికీ వాటిని సద్వినిగం చేయటంలో పాలకులు వెనుకబడ్డారని ఆరోపించారు. కొబ్బరి రైతు ను ఆదుకు నేందుకు ప్రత్యేక చర్యలు చేపడతా మన్నారు. జిల్లా అభివృద్ధి పథంలో నడిపించ వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాలు కురువయ్యాయని దీంతో పరిశ్రమలు స్థాపించేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో యువతకు ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశా రు. రాష్ట్ర ఆదాయం అంతా బటన్ నొక్కుడు పేరుతో దారి మళ్లించారని దుయ్యపట్టారు. జిల్లాలో తీర ప్రాంతం గిరిజన ప్రాంతం మైదాన ప్రాంతం ఉద్దా న ప్రాంతం ఉందని అందులో పుష్కలం గా వనరులు ఉన్నాయని వాటిని సద్వి నియోగం చేసుకుంటే జిల్లాను సస్యశ్యా మలం, పారిశ్రామిక అభివృద్ధి చేయవ చ్చుని పరమేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే గ్యారెంటీలు అమలు చేస్తామని, ఆ బ్రోచర్లను ఆవిష్కరించా రు. తాను పార్లమెంటు సభ్యునిగా గెలిస్తే 15 హామీలు నెరవేరుస్తానని హామీల బ్రోచర్లను నాయకులతో కలిసి ఈ సంద ర్భంగా పరమేశ్వరరావు ఆవిష్కరించా రు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాజీ కార్యదర్శి పి. కృష్ణమూర్తి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కె. నాగమణి కాంగ్రెస్ పార్టీ నాయకులు బొత్స రమణ మూర్తి లకి నేని నారాయణరావు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని గెలిపించాలి

ఎమ్మెల్సీ, ఎమ్మేల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రఅద్భుతమైన పాలన చేస్తున్నారని శాసనమండలి సభ్యులు, టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాసరావు అన్నారు. శనివారం చెట్లతాండ్ర, దండుగోపాలపురం, వడ్డీతాండ్ర పంచాయితీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్ళి సంక్షేమ ప్రభుత్వానికి మళ్ళీ ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. తమ గ్రామానికి వచ్చిన ఆత్మీయ నేత దువ్వాడ శ్రీనివాసరావు గ్రామ ప్రజలు జేజేలు పలికారు. ప్రజాహితం కోరుతూ , ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను దువ్వాడ వివరించారు. కార్యక్రమంలో చెట్లతాండ్ర పంచాయతీ వైకాపా నాయకులు, దండుగోపాలపురం సర్పంచ్ మార్పు. అశోక్ చక్రవర్తి, మార్పు. నాగభూషణ్, ఎంపీటీసీ సభ్యులు పొందల. రామకృష్ణ, కోటపాడు పంచాయతీ సర్పంచ్ కోత. ఇందిర, వడ్డీతాండ్ర వైసీపీ నాయకులు అనంతు హన్నురావు, ఎంపిపి రాజేశ్వరీ అప్పారావ్, పీఏసీస్ చైర్మన్ కెల్లి జగన్నాయ, మండల పార్టీ అధ్యక్షులు కోత. సతీష్, వైస్ ఎంపీపీ సభ్యులు నక్క. చింతామణి బీమారావు, పొందల రామక్రిష్ణ సర్పంచులు పరపటి సునీత శ్రీనివాసరెడ్డి, శ్రీరంగం వీరస్వామి, పిలక బృందా రవికుమార్ రెడ్డి, బుడ్డ మోహన్ రెడ్డి, దుక్క భూషణ్ రెడ్డి, నక్కిట్ల అప్పన్న నరేష్, సూరాడ వెంకటేష్, బుసకల లక్ష్మీ కాంతం లక్ష్మయ్య, కళింగపట్నం లక్ష్మీ అప్పారావు, గొరుసు సవరయ్య, ఎంపీటీసీ సభ్యులు దూబ వేణుగోపాల్ రాజ్, సూరాడ రాజారావు, కొండాల కొండయ్య, చింతల రాజులు, వార్డు సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారదులు, వివిధ హెూదాలలో గల సీనియర్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బీజెపి పొత్తు పార్టీలకు ఓటేయొద్దు...

విశాలాంధ్ర-పలాస : రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేసినా బిజెపి పార్టీతో పొత్తు పెట్టుకున్నాయని, అటువంటి పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఓటు వేయవద్దని సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ పలాస ఎమ్మెల్యే అభ్యర్థి పోతనపల్లి కామేశ్వరరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడు, నీలావతి, మాకన్నపల్లి, గురుదాసుపురం ప్రాంతాల్లో శనివారం ప్రచారం నిర్వహించి ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడి అదాని, అంబానిలకు భారత దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఉద్దాన ప్రాంతంలో ఎలుగుబంట్ల దాడిలో పదుల సంఖ్యలో మృతి చెందుతున్నా అధికార పార్టీ పట్టించుకోవడం లేదన్నారు. జీడిపిక్కలకు మద్దతు ధర లేక రైతులు అల్లాడిపోతుంటే టీడీపీ, వైసీపీ పార్టీలు జీడికి మద్దతు ధర కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. తనకు ఒక్క అవకాశమిస్తే పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో స్టార్ గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, దున్న శ్రీను, మద్దిల కైలాస్, మద్దిల పండులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర-పలాస: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని పలాస ఎమ్మెల్యే అభ్యర్థి మజ్జి త్రినాద్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని పెసరపాడు, చినబాడాం, చినబాడాం కాలనీ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు సాగునీరుతో పాటు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆఫ్షోర్ రిజర్వాయరు నిర్మాణం చేపడితే ప్రభుత్వాలు మారుతున్నా నేటికి ఆఫ్షోర్ పూర్తి చేయలేకపోయారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆఫ్షోర్ రిజర్వాయరు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొర్ల హేమారావు చౌదరి, బద్రి సీతమ్మ, శ్రీరంగ సురేష్, మజ్జి షన్ముఖరావు, దుప్పల చలపతిరావు, ఉప్పాడ రాజారావు, కొర్ల విశ్వనాథం, ఎన్.భీమారావు, ఎన్.శాంతమ్మలు పాల్గొన్నారు.

వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి : రెడ్డి శాంతి..

విశాలాంధ్ర-హిరమండలం: రాష్ట్ర భవిష్యత్తు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి తోనే సాధ్యమని పాత పట్నం నియోజకవర్గం లో వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి గా రెండో సారి రెడ్డి శాంతి అనే నేను పోటీ చేయనున్నాను, శ్రీకాకుళం వైసీపీ ఎంపీ అభ్యర్థి గా పేరాడ తిలక్ పోటీ లో ఉన్నారు మా ఇద్దరు కి ఫ్యాన్ గుర్తు పై ఓట్లు వేసి వైసీపీ గెలుపే లక్ష్యం గా పనిచేయాలని రెడ్డి శాంతి పిలుపు నిచ్చారు. శనివారం మండలం లోని ఫింద్రువాడ పంచాయతీ లోని 20 కుటుంబాలు వైసీపీ లో చేరారు. వీరికి రెడ్డి శాంతి వైసీపీ ఖండువాలు వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీ లోకి వచ్చిన వారు మాట్లాడుతూ మే 13 న జరుగు సార్వత్రక ఎన్నికల్లో మా బూత్ లో వైసీపీ మెజారిటీ ఓట్లు వచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. వీరుని వైసీపీ పార్టీ లోనికి చేర్పించేందుకు కారకులైన మండల వైసీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, వైస్ ఎంపీపీ ప్రతినిధి వంగ పల్ల చిన్నారావు, గడియా సుధీర్, పొదిలాపు శ్రీరాములు, పొట్నూరు సింహ చలం, మీసాల రామారావు తదితరులు కు రెడ్డి శాంతి ధన్యవాదములు తెలియజేశారు.

వైసీపిని గెలిపించేందుకు యువత సైనికుల్లా పనిచేయాలి : ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావుకి యువత పెద్దఎత్తున అండగా నిలుస్తున్నారు. తమ ధైర్యం ధర్మాన ప్రసాదరావు అని నమ్ముతూ యువకులు వైసీపీలో వరుసగా చేరుతున్నారు. ధర్మాన నాయకత్వంలో పనిచే యడం కోసం ముందుకువస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటూ ఆయనకి నాయకత్వానికి జై కొడుతున్నారు. గూనపాలెం ప్రాంతానికి చెందిన దళిత యువకులు వారి మిత్రులు,స్నేహితులు కలిసి భారీ ఎత్తున ధర్మాన ప్రసాదరావు సమక్షంలో శనివారం వైసీపీలో చేరారు. గూనపాలెం పరిసర ప్రాంతాలకి చెందిన యువ కులు అంతా అబ్బాస్ నాయకత్వంలో ర్యాలీగా ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ అబ్బాస్ తో పాటు యువకులందరికి స్వయంగా ధర్మాన ప్రసాదరావు పార్టీ కండువాలు వేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారి చేరిక సందర్భంగా ధర్మాన క్యాంపు కార్యాలయం యువకులతో సందడిగా మారిపోయింది. ధర్మాన నాయకత్వం వర్థిల్లాలంటూ యువకులు నినాదాలు చేస్తూ హెూరెత్తించారు. వారందరి అభిమానాన్ని చూసి ధర్మాన ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేశారు. యువత వైసీపిలో చేరడం శుభపరిణామమని హర్షం వెలిబుచ్చారు.

అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ దిగంబర్ ప్రధాన్

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో నున్న చెక్ పోస్టువద్ద మద్యం, నగదు తదితర అక్రమంగా రవాణా కాకుండా అనుక్షణం అప్రమత్తత వ్యవహరించి విధులు నిర్వహించాలని ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ దిగంబర్ ప్రధాన్ అన్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలోనున్న మండలంలో గల వసుంధర చెక్ పోస్ట్ ను శనివారం నాడు ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సరిహద్దు ప్రాంతంలో నున్న చెక్ పోస్టదగ్గర జరగనున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేసి తనిఖీలు చేయాలని, నగదు, గంజాయ్ తదితర వాటిని రవాణా కాకుండా చూడాలన్నారు. ఈ సందర్భనలో ఆయనతోపాటు స్థానిక ఎస్సై రాజేష్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

బాబు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వరాలు

విశాలాంధ్ర-నందిగాం: మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచారం మండలంలో నరేంద్రపురం పంచాయతీ, పాలవలస పతినవానిపేట, నారాయణపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసి తెదేపా అధికారంలోకి రాగానే అందించబోయే పథకాలు వివరాలు తెలియజేశారు. మే 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకి ఓటు వేసి ఎమ్మెల్యేగా కింజరాపు అచ్చెన్నాయుడును ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడులను అత్యధిక మెజారిటీతో గెలిపించమని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, వంశధార చైర్మన్ మల్ల బాలకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలాకి చంద్రశేఖర రావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కూరాకుల యాదవ్, జనసేన జిల్లా కార్యదర్శి మెట్ట అవినాష్, శివరాంపురం తెదేపా సర్పంచ్ జానకిరామ్, తెదేపా జనసేన మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్

విశాలాంధ్ర-అరసవల్లి: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్లోని చేపల మార్కెట్లో మత్స్యకారులతో శనివారం నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బుర్రా సత్తిబాబు, 400 కుటుంబాలతో కలసి వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి గొండు శంకర్ కండువాలను వేసి పార్టులోకి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన మార్కెట్ పరిసర డివిజన్ల ఇంచార్జిలు మైలపల్లి నర్సింహామూర్తి, బుర్రా ప్రసాద్, కొమర కమల, రాజు, బుర్రా సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన ముఖాముఖీ కార్యక్రమంలో గొండు శంకర్ మాట్లాడుతూ పార్టీ స్థాపించిన నాటినుంచి టీడీపీకి మత్స్యకారులు అండగా వుంటూ వచ్చారన్నారు. అదేవిధంగా వారి సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి టీడీపీ కృషి చేసిందని గుర్తు చేసారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు.గత అయిదేళ్ల వైకాపా పాలనలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇతర దేశాల్లో చిక్కుకున్న మత్స్యకారులను స్వగ్రామాలకు రప్పించడంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు కృషి ఏ ఒక్క మత్స్యకారుడు మరచిపోలేనిదని చెప్పారు. త్వరలో అధికారంలోకి రానున్న ఎన్డియే హయాంలోనూ మత్స్యకారులకు ప్రాధాన్యత కల్పించడం జరిగిందని చెప్పారు. జీవో 217ను రద్దు చేస్తామని, వేట విరామ సమయంలో 20వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డియే కి మద్దతు పలుకుతూ కూటమి విజయానికి కలసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో కూటమి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు హ్యాట్రిక్ విజయాన్ని అందజేసి మోదీకి, ఎమ్మెల్యే గా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల ఇంచార్జిలు, అనుబంధ విభాగాల నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నేహ హస్తం అందించిన చిన్ననాటి మిత్రులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలం వింజంపాడు గ్రామానికి చెందిన డోకి జగదీష్ భార్య డోకి జయలక్ష్మి ఇటీవల రోడ్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆ కుటుంబానికి మేము ఉన్నాం...మీకేమి కాదు అని "తీవ్ర అనారోగ్యంతో ఉన్న జగదీష్" కు తన తోటి విద్యార్థులు ధైర్యం చెప్పి ఆదుకున్నారు. 1999-2000 విద్యా సంవత్సరం జర్జంగి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా తమ మిత్రుని కుటుంబ పరిస్థితి తెలుసుకొని, ఆయన ఇద్దరి ఆడపిల్లల ఉన్నత చదువుల నిమిత్తం రూ.55,500లు ఆర్థిక సాయం అందించారు. జగదీష్ మిత్రులు చేసిన సహాయంకు వింజంపాడు గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో గొండు నారాయణరావు, గుంట సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.